
EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
27 ఏప్రిల్ 2024
పేజీలు: 02






## ప్రజలు కేసీఆర్‌నే కోరుకుంటున్నారు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అలాగే, తమను ఎవరెంత కించపరచినా కుంగిపోమని చెప్పుకొచ్చారు. ఎన్నో పోరాటాలతో, లక్ష్యంతో తెలంగాణ సిద్ధించిందని గుర్తు చేశారు. కాగా, నేడు బీఆర్ఎస పార్టీ ఆవిర్భావ దినోత్సవం. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. అనంతరం, కేటీఆర్ మాట్లాడుతూ..'ప్రజాస్వామ్య ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత కేసీఆర్ పార్టీని ఏర్పాటు చేశారు. ఎన్నో పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. అధికార గర్వంతో ఉన్న ఆనాటి కాంగ్రెస్ మెడలు వంచి రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ కృషి చేశారు. కుట్రలు, ప్రలోభాలతో ఉద్యమాన్ని ఆపాలని చూశారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని 2014లో ప్రభుత్వం వచ్చింది. ఎన్నో సమస్యల పరిష్కారం కోసం పార్టీ, ప్రభుత్వం రెండు పని చేశాయి. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రంలో మహారాష్ట్రలో కూడా పార్టీ విస్తరించింది. కానీ, దురదృష్టవశాత్తూ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యం. ఇప్పుడు ప్రజలు మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. ఎవరెంత కించపరిచినా మేము కుంగిపోము. 24ఏళ్లలో మాకు ఇచ్చిన గౌరవం, అభిమానానికి ధన్యవాదాలు. వందల మంది రాష్ట సాధన కోసం ప్రాణాలు వదిలారు. మీ స్ఫూర్తితో మేము ముందుకు వెళ్తాము' అని వ్యాఖ్యలు చేశారు.




## వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల

### 2 పేజీల మేనిఫెస్టోను ఆవిష్కరించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి

వైఎస్ఆర్‌సీపీ మేనిఫెస్టోను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విడుదల చేశారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం దాకా అమలు చేయడం జరిగిందన్నారు జగన్. మేనిఫెస్టోను పవిత్ర బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి అమలు చేస్తున్నామన్నారు. ఇతర పార్టీల్లాగా అలవికాని హామీలు, ఆచరణ సాధ్యం కాని పథకాలకు తమ మేనిఫెస్టోలో చోటు లేదన్నారు జగన్. అక్కాచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, రైతులకు, కార్మికులు, యువత, విద్యార్థులకు మేనిఫెస్టోలో సమాన ప్రాధాన్యత కల్పించామన్నారు. ఉన్న పథకాలకు కొనసాగిస్తూ ఇచ్చే నిధుల పెంచుతూ, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసేలా మేనిఫెస్టో రూపకల్పన చేశామన్నారు. అమ్మఒడి, పెన్షన్లు, రైతు భరోసా, చేదోడు నిధులను పెంచారు. అలాగే యువతకి ఉపాధి అవకాశాలపైనా ప్రత్యేక ఫోకస్ పెట్టామన్నారు. అమలు చేయలేని హామీలిచ్చి ఆపేసేకంటే.. చేసేది స్పష్టంగా ప్రజలకు చెప్పే అజెండాతో మేనిఫెస్టోను ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ముకాకుండా అన్ని వర్గాలు అదరించేలా మేనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. మేనిఫెస్టోలో లేని అంశాలను సైతం అమలు చేస్తామన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో ఒక్క హామీ అన్న అమలు చేశారా? అని జగన్ ప్రశ్నించారు. ముఖ్యమైన హామీలతో చంద్రబాబు సంతకం పెట్టి గతంలో ఇదే కూటమి ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. గతంలో ఉన్న రుణమాఫీ, డ్వాక్రా రుణాలను చంద్రబాబు ఎగ్గొట్టారన్నారు. కనీసం ప్రత్యేక హోదా అంశాన్ని కూడా పట్టించుకోకుండా.. అదేమైనా సంజీవనా? అంటూ వెటకారంగా మాట్లాడారు. విశ్వసనీయత లేనప్పడు రాజకీయాలు చేయడం ఎందుకు? రాజకీయ నాయకుడంటే.. తాను చనిపోయాక ప్రతీ ఇంట్లో తన ఫొటో, పేదవాడి గుండెల్లో మనం ఉండాలనే తాపత్రయం ఉండాలని సీఎం జగన్ అన్నారు.

### మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు

- ఉన్న పథకాలకు కొనసాగిస్తూ ఇచ్చే నిధుల పెంపు
- భారీ హామీలు కాకుండా.. చేసేదే చెప్తామనేలా మేనిఫెస్టో
- సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసేలా రూపకల్పన
- అమ్మఒడి, పెన్షన్లు, రైతు భరోసా, చేదోడు నిధుల పెంపు
- యువతకి ఉపాధి అవకాశాలపైనా ప్రత్యేక ఫోకస్
- రెండు విడతల్లో పెన్షన్ రూ.3,500 దాకా పెంపు
- అమ్మ ఒడి, విద్యాకానుక, మహిళలకు వైఎస్సార్ చేయూత తదితర పథకాల కొనసాగింపు
- వైఎస్సార్ చేయూత రూ.75 వేల నుంచి రూ. లక్షా 50 వేలకు పెంపు
- అమ్మ ఒడి రెండు వేలకు పెంచుతాం. రూ. 17వేలు చేస్తాం. తల్లుల చేతికి రూ.15 వేలు.
- వైద్యం, ఆరోగ్యశ్రీ విస్తరణ
- వైఎస్సార్ కాపు నేస్తం నాలుగు దఫాల్లో 60 వేల నుంచి లక్షా 20వేలకు పెంపు
- నాలుగు దఫాల్లో ఈబీసీ నేస్తం 45 వేల నుంచి లక్షా 5 వేల రూపాయలకు పెంపు
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.3 లక్షల రుణం
- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కొనసాగింపు
- అర్హులైె ఇళ్ల స్థలాలు లేనివాళ్లందరికీ ఇళ్లు.. ఇళ్ల పట్టాల కొనసాగింపు



## ఆ దేశంలో ఒక్క బిడ్డను కంటే రూ.61 లక్షలు!

దక్షిణ కొరియా జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీనిని పరిష్కరించడానికి పిల్లలకు జన్మనిచ్చే తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా ఒక్కో బిడ్డకు రూ. 61 లక్షలు ఇవ్వాలని ఆ దేశ ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ వినూత్న చర్యను అమలు చేయడానికి ముందు ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఒక పబ్లిక్ సర్వేను నిర్వహించింది. పెరిగిన జీవన వ్యయం, తగ్గిన జీవన నాణ్యత వెరసి దంపతులు వివాహ బంధానికి, పిల్లలను కనేందుకు విముఖత చూపుతున్నారు.



## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు మృతి

ఉత్తరకాశ్మీర్‌లోని బారాముల్లాలో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. మరో ఇద్దరు భద్రతా సిబ్బంది, సాధారణ పౌరుడు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని సోపోర్‌లో నౌపారా ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ ఎన్‌కౌంటర్ శుక్రవారం ఉదయం వరకూ కొనసాగినట్లు పోలీసు ఉన్నతాధికారులు మీడియాకు తెలిపారు.

## బిడ్డకు పాలిస్తూ.. తల్లి మృతి

కన్నబిడ్డకు పాలిస్తూ.. గుండెపోటుతో బాలింత మృతి చెందిన ఘటన నల్గొండ జిల్లా రఘునాథపల్లి (M) శివాయిగూడెంలో చోటుచేసుకుంది. డాక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భవాని(25) ఫిబ్రవరి 12న పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం పుట్టింటికి నిద్ర చేసేందుకు వచ్చింది. ఈక్రమంలో బిడ్డకు పాలిస్తూ స్పృహ తప్పి పడిపోవడంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీకుసుకెళ్లారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు.




## పింఛన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలు

పించన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరింది. పింఛన్ సహా నగదు బదిలీ పథకాలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను మార్చి 30న జారీ చేసినట్లు వెల్లడించింది. ఆ మార్గదర్శకాలను వాస్తవిక దృష్టితో ఆలోచించి అమలు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డికి తేల్చిచెప్పింది. పంపిణీకి శాశ్వత ఉద్యోగులను వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. పించన్ల ఇంటింటి పంపిణీకి వాలంటీర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని ఈసీ ఆదేశించింది. పించన్ల అందజేతలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై చాలా ఫిర్యాదులు వచ్చాయని ఈసీ పేర్కొంది. లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా, ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డికి సూచించింది.

## నటుడు అదృశ్యం.. పోలీసులకు తండ్రి ఫిర్యాదు



ప్రముఖ నటుడు గురుచరణ్ సింగ్ గత నాలుగు రోజులుగా కనిపించడం లేదు. 'తారక్ మెహతా కా ఊల్తా చష్మా' షోలో రోషన్ సింగ్ సోధి పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. చివరిసారిగా ఏప్రిల్ 22 న ఢిల్లీ విమానాశ్రయంలో కనిపించాడు. ముంబైకి రావాల్సి ఉన్నా ఆయన రాలేదు. అంతేకాకుండా ఫోన్ చేసినా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఢిల్లీ పోలీసులకు ఆయన తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

## భారీగా తగ్గుతున్న ఫారెక్స్ నిల్వలు



దేశంలో విదేశీ మారకం నిల్వలు(ఫారెక్స్) క్రమంగా పడిపోతున్నాయి. ఈమేరకు భారతీయ రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో కీలక అంశాలను ప్రస్తావించింది. వరుసగా రెండోవారం ఈ నెల 19తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.82 బిలియన్ డాలర్లు కరిగిపోయి 640.334 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది. అంతకుముందు వారంలో ఈ నిలువలు 5.401 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయిలో 642.453 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ మారక నిల్వలు మళ్లీ నాలుగేళ్ల తర్వాత ఈ గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. మరోవైపు పసిడి రిజర్వులు పెరుగుతున్నాయి. తాజాగా 1.01 బిలియన్ డాలర్లమేర బంగారు రిజర్వులు పెరిగి 56.808 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

పడిపోతున్న రూపాయి

ఇతర అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ప్రధానంగా అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో గత కొన్ని నెలలుగా రూపాయి విలువ క్రమంగా పతనమవుతోంది.

## అభిమానుల ప్రేమను పొందడం సులభం కాదు

మాటను గౌరవించే అభిమానులు ఉండడం అదృష్టమన్నారు హీరోయిన్ సమంత. సినిమాలకు విరామం ఇచ్చిన ఆమె యూట్యూబ్ వేదికగా పాడ్‌కాస్ట్ సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తాజాగా అభిమానుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం చిన్న విషయం కాదు. నా ఫ్యాన్స్‌లో చాలామందికి వినోదం, ఫ్యాషన్, మేకప్‌పై ఆసక్తి ఎక్కువ. వాళ్లను చూసి ఎన్నో విషయాలపై నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. కొత్త అంశాలపై అవగాహన వచ్చింది. నా మనసుకు నచ్చిందిచేస్తాను. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అది సరైనదా.. కాదా అని ఆలోచిస్తాను. మానసికంగా ప్రశాంతంగా లేకపోతే శారీరకంగా కూడా ఫిట్‌గా ఉండలేరు. అందుకే నేనెప్పుడు మెంటల్ హెల్త్‌కు ప్రాముఖ్యతనిస్తాను. దానికోసం అవసరమైన వ్యాయామాలు చేస్తుంటాను' అని చెప్పారు.



## ఎర్ర సముద్రంలో చమురు ట్యాంకర్ నౌకపై హౌతీల దాడి

ఎర్ర సముద్రంలో మరో వాణిజ్య నౌకపై దాడి జరిగింది. గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హమాస్‌కు మద్దతుగా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలే లక్ష్యంగా వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో నౌకపై దాడి చేశారు. భారత్‌కు వస్తున్న 'ఆండ్రోమెడా స్టార్' అనే చమురు ట్యాంకర్ నౌకపై హౌతీ రెబల్స్ క్షిపణితో దాడి చేశారు. ఈ విషయాన్ని హౌతీ తిరుగుబాటుదారులే శనివారం ప్రకటించారు. పనామా జెండా ఉన్న నౌకపై దాడి చేసినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా సరియా తెలిపారు. ఇటీవలే ఈ నౌకను విక్రయించినట్టు షిప్పింగ్ డేటా ద్వారా తెలుస్తోంది. ఈ నౌక రష్యాలోని ప్రిమోర్క్ నుంచి గుజరాత్‌లోని వడినార్‌కు వెళ్తుండగా దాడి జరిగినట్లు ఆంబ్రే తెలిపింది.





## శ్రీలంక అమ్మాయి.. జగిత్యాల అబ్బాయి

ఉద్యోగం కోసం జోర్డాన్ దేశం వెళ్లిన మేడిపల్లి అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో హిందూసాంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. మెట్‌పల్లి మండలం మూడుబొమ్మల మేడిపల్లి గ్రామానికి చెందిన జొరిగె అశోక్ ఉద్యోగం కోసం జోర్దాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ శ్రీలంక దేశానికి చెందిన సమన్వి పరిచయమైంది. ఇరువురి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో అశోక్ అక్కాబావలైన రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన చేగంటి శేఖర్-పూజితలు హిందూ సాంప్రదాయ ప్రకారం భూపతిపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వీరి వివాహం జరిపారు. దంపతులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ సర్పంచులు వాసరి రవి, మాజీ ఎంపీటీసీ బెజ్జంకి మోహన్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు ఆశీర్వదించారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# అప్పుడు సూసైడ్ చేసుకోవాలనుకున్నా

ఆత్మ హత్య చేసుకోవాలనే ఆలోచనలు తనకు వచ్చాయని.. వెంటనే వాటి నుంచి బయటపడ్డానని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డెలావేర్ మెమోరియల్ బ్రిడ్జ్ వద్దకు వెళ్లిన తాను అక్కడి నుంచి దూకి ఆత్మచేసుకోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. అయతే తన పల్లల గురించి ఆలోచించి... ఆత్మహత్య చేసుకుకోవాలన్న నిర్ణయాన్ని విరమించుకున్నని తెలిపారు. 1972 సంవత్సరంలో తొలిసారి సెనేటర్‌గా గెలుపొందిన కొన్నిరోజులకు బైడెన్... తన భార్య నీలియా, 18 నెలల బాబు రోడ్డు ప్రమాదంలో దూరమయ్యారని వెల్లండించారు. ఆ సమయలో చాలా బాధలో ఉన్న తనకు ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన వచ్చిందని చెప్పారు. ఆ బాధలో తాగటం అలవాటు లేని తాను మందు బాటిల్ తీసుకొని డెలావేర్ బ్రిడ్జ్ వద్దకు వెళ్లి తాగుతుండగా.. ఆత్మహత్య ఆలోచన వచ్చిందన్నారు. కానీ, తన మిగతా ఇద్దరు పిల్లల భవిష్యత్తు ఆలోచించి.. ఆ నిర్ణయాన్ని విరమించుకున్నానని తెలిపారు. కష్టాలు వచ్చినప్పడు వచ్చి ఆత్మహత్య చేసుకోవాలన్న పిచ్చి ఆలోచనలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. అదే విధంగా మరో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి మాట్లాడుతూ.. అమెరికా ఎన్నికలకు ముందే డిబేట్‌లో పాల్గొనాలని ఉన్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఓ చోట ట్రంప్‌తో డిబేట్ తనకు సంతోషమన్నారు. దీనిపై ట్రంప్ సైతం ప్రతిస్పందించారు. 'నేను సిద్ధంగా ఉన్నాను. ఎక్కడైనా, ఎప్పడైనా, ఏ సమయానికైనా బైడెన్‌తో డిబేట్‌కు అంగీకరిస్తున్నా' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇక.. అధ్యక్ష పదవి ఎన్నికల డిబేట్ల ఎన్నికల తేదీలు, వేదికల వివరాలు విడుదలయ్యాయి. సెప్టెంబర్ 16న టెక్సాస్‌లోని శాన్ మార్కోస్, అక్టోబర్ 1న వర్జీనియాలోని పీటర్స్‌బర్గ్, అక్టోబర్ 9న సాల్ట్ లేక్ సిటీలో జరగనున్నాయి.

# మెదక్ కింగ్ ఎవరు..?







బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అందరి దృష్టి మెదక్ పార్లమెంట్ స్థానంపైనే ఉంది. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వంటి కాకలుతీరిన నేతలు ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో విజయం ఎవరిని వరిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు గట్టి అభ్యర్థులను బరిలో దింపగా, వారు నువ్వానేనా అన్నట్టు పోటీ పడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి చేరికలు..విమర్శలు.. ప్రతివిమర్శలతో మెదక్ పార్లమెంట్ స్థానంలో రాజకీయం వేడెక్కింది. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీ బలంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఎదురవుతోంది. మొత్తం మీద ఈ స్థానంలో త్రిముఖ పోరు కొనసాగుతోందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో నెలకొంది. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తొమ్మిదిసార్లు, బీఆర్ఎస్ ఐదు పర్యాయాలు (ఉప ఎన్నికతో కలిపి) గెలిచాయి. బీజేపీ, టీడీపీ, పీడీఎఫ్, టీపీఎస్ ఒక్కోసారి విజయం సాధించాయి.

పట్టు నిలుపుకునేందుకు టీఆర్ఎస్

2004 నుంచి రెండు దశాబ్దాలుగా ఈ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉంది. ఈసారి కూడా ఎలాగైనా పట్టు నిలుపుకునేందుకు గులాబీ పార్టీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి. వెంకట్రాంరెడ్డిని `బీఆర్ఎస్ బరిలోకి దింపింది. గెలుపు బాధ్యత మాజీ మంత్రి హరీశ్‌రావు తన భుజాలపై వేసుకొని నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండగా, ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానంలో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందింది. ఈ ఫలితాలను పునరావృతం చేసేందుకు బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.

పాగా వేసేందుకు బీజేపీ యత్నం..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఒకేఒక దుబ్బాక సీటును కోల్పోయి.. ఘెర పరాజయం పాలైన కమలం పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని ప్రయతీనస్తోంది. ప్రధాని మోదీకి ప్రజల్లో ఉన్న చరిష్మాతో ఈ ఎన్నికల్లో ముందుకెళుతోంది. బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎం.ఘునందన్‌రావును బరిలో దింపింది. పార్టీకి బలమైన కేడర్ ఉన్నా, అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఈ పార్టీ తరపున పోటీ చేసిన నందీశ్వర్‌గౌడ్ వంటి నాయకులు ఈ ఎన్నికల్లో అంటీ ముట్టనట్టుగా ఉంటున్నారు. సంగారెడ్డి నుంచి పోటీ చేసిన పులిమామిడి రాజు పార్టీని వీడారు.

సత్తా చాటేందుకు కాంగ్రెస్ యత్నం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెదక్ స్థానంలో సత్తా చాటేందుకు సై అంటోంది. వరుస చేరికలతో ఊపు మీదున్న హస్తం పార్టీ దూకుడుగా ముందుకెళుతోంది. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితర నాయకులను పార్టీలో చేర్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా నీలంమధు ముదిరాజ్‌ను ఎంపిక చేసింది. ప్రత్యర్థి పార్టీల నుంచి ఇద్దరు అగ్రవర్ణాల అభ్యర్థులు పోటీ చేస్తుండగా., కాంగ్రెస్ వ్యూహాత్మకంగా బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని ఎంపిక చేసింది.



# కావ్య కళ్యాణ్ రామ్ క్రేజీ ఫోజులు

కావ్య కళ్యాణ్ రామ్ చిన్న తనంలో గంగోత్రి, ఠాగూర్ లాంటి చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించింది. గత ఏడాది విడుదలైన బలగం చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికి తెలుసు. వేణు తెరకెక్కించిన బలగం చిత్రం సృష్టించిన సంచలనం అలాంటిది. తెలంగాణ గ్రామీణ భావోద్వేగాలు ఎంతో అద్భుతంగా తెరక్కించిన వేణు.. బలగం చిత్రంతో భారీ విజయం అందుకున్నాడు. ప్రియదర్శి మెయిన్ లీడ్ పాత్రలో నటించగా.. కావ్య కళ్యాణ్ రామ్ హీరోయిన్ గా నటించింది. కావ్య కళ్యాణ్ రామ్ చిన్న తనంలో గంగోత్రి, ఠాగూర్ లాంటి చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించింది. భావోద్వేగాలని అద్భుతంగా ఆవిష్కరిస్తూ బలగం చిత్రాన్ని మరచిపోలేని మూవీగా మలిచారు అంటూ వేణు ప్రశంసలు అందుకున్నారు. కావ్యకి కూడా గుర్తుంచుకో దగ్గ పాత్రే దక్కింది. అయితే ఈ చిత్రంలో గ్లామర్ కి అవకాశం లేదు కాబట్టి సింపుల్ గా కనిపించింది. అయితే ఛాన్స్ వస్తే గ్లామర్ రోల్స్ కి కూడా సిద్ధం అన్నట్లుగా కావ్య కళ్యాణ్ రామ్ సంకేతాలు పంపుతోంది. తాజాగా కావ్య కళ్యాణ్ రామ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోస్ చూస్తే ఎంతో అందంగా ఉన్నాయి.



# చరిత్ర సృష్టించిన పంజాబ్




వరుసగా నాలుగు ఓటములు.. ప్లే ఆఫ్స్ ఆశలు మిణుకుమిణుకు మంటున్న వేళ గెలవక తప్పని మ్యాచ్‌లో పంజాబ్ బ్యాటర్లు కొదమ సింహాల్లా విరుచుకుపడ్డారు ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(54), జానీ బెయిర్‌స్టో(108 నాటౌట్)లు ఆకాశమే హద్దుగా ఆడారు. సునీల్ నరైన్ ఓవర్లో వరుసగా ఫోర్, సిక్సర్‌తో హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. 18 బంతుల్లోనే అర్ధ శతకం సాధించిన అతడు రనౌట్‌గా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రాన్‌ను రనౌట్ చేశాననే బాధ.. జట్టును గెలిపించాలనే కసితో బెయిర్‌స్టో తన విధ్వంసాన్ని చూపించాడు. చక్రవర్తి, నరైన్, రస్సెల్ బౌలింగ్‌లో సిక్సర్ల మోతతో హాఫ్ సెంచరీ సాధించాడు.

45 బంతుల్లోనే..

రెండో వికెట్‌కు రీసే రసోస్(26)తో 85 రన్స్ జోడించి కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆ తర్వాత వచ్చిన శశాంక్ సింగ్(68 నాటౌట్).. పంజాబ్‌ను పోటీలో నిలిపాడు. ఈ సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝులిపించిన బెయిర్‌స్టో కేవలం 45 బంతుల్లోనే 8 ఫోర్లు, 8 సిక్సర్లతో సెంచరీ బాదాడు. రికార్డు ఛేదన చూసి పంజాబ్ బెదరలేదు. తామేమైనా తక్కువ తిన్నామా అన్నట్టుగా కింగ్స్ ఓపెనర్లు శివాలెత్తారు. పవర్ ప్లేలో ప్రభ్‌సిమ్రన్ కోల్‌కతా బౌలర్లను ఊచకోత కోస్తే అతడి తర్వాత వంతు బెయిర్ స్టోది. ఆ తర్వాత బెయిర్ స్టో బాదుడు బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. చక్రవర్తి 9వ ఓవర్లో వన్ హ్యాండెడ్ సిక్సర్‌తో 23 బంతుల్లోనే 50 రన్స్ పూర్తిచేసిన బెయిర్ స్టో ఆ తర్వాత ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. చక్రవర్తి, రస్సెల్‌ను లక్ష్యంగా దాడికి దిగాడు. రస్సెల్ 12వ ఓవర్లో 3 సిక్సర్లతో సెంచరీకి చేరువయ్యాడు.

# మణిపూర్‌లో మిలిటెంట్ల అటాక్.. ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్ల మృతి



మణిపూర్‌లో మిలిటెంట్ అటాక్ జరిగింది. ఇవాళ ఉదయం జరిగిన ఆ దాడిలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. బిష్ణుపుర్ జిల్లాలో ఈ దాడి జరిగింది. నారన్‌సైనా గ్రామం వైపున ఉన్న కొండ ప్రాంతాల నుంచి కుకీ మిలిటెంట్లు గన్‌ఫైర్‌కు పాల్పడ్డారు. వ్యాలీలో ఉన్న కేంద్ర బలగాల పోస్టును వాళ్లు టార్గెట్ చేశారు. అయితే ఔట్‌పోస్టులో బాంబు పేలడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఆ పేలుడు వల్ల నలుగురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంట్లో ఇద్దరు చనిపోగా, ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మణిపూర్ సంక్షోభానికి ఏడాది కాలం కావస్తున్న తరుణంలో ఈ అటాక్ జరిగినట్లు టాప్ పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. కొండ ప్రాంతాల్లో దాక్కుకున్న మిలిటెంట్లు రానున్న రోజుల్లో దాడులు పెంచే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. మృతిచెందిన ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు 128 బెటాలియన్‌కు చెందినవాళ్లు. ఒకరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ సర్కార్ కాగా రెండో వ్యక్తి కానిస్టేబుల్ అరూప్ సైని. గాయపడ్డవారిని జాదవ్ దాస్, అఫ్తాబ్ దాస్‌గా గుర్తించారు.

# పారితోషికంలో తగ్గేదేలేదంటున్న పుష్ప



'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు అగ్ర హీరో అల్లు అర్జున్. పుష్పరాజ్ పాత్ర దేశవ్యాప్తంగా మాస్, యూత్ ప్రేక్షకులకు బాగా చేరువైంది. దీంతో 'పుష్ప-2' చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. కొద్ది రోజుల కిత్రం విడుదల చేసిన టీజర్ సోషల్‌మీడియా వీక్షణల్లో రికార్డు బ్రేక్ చేసింది. ఈ సినిమాపై నెలకొన్న హైప్ దృష్ట్యా థియేట్రికల్, ఓటీటీ బిజినెస్‌లు భారీ డీల్‌తో క్లోజ్ అయ్యాయని అంటున్నారు. 275కోట్లకు డిజిటల్ హక్కులు అమ్ముడుపోయాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ రెమ్యునరేషన్ గురించి కూడా ఓ ఆసక్తికరమైన వార్త బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. 'పుష్ప-2' చిత్రానికి అల్లు అర్జున్ దాదాపు 150కోట్ల పారితోషికాన్ని తీసుకోబోతున్నారని ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ అదే గనుక నిజమైతే దేశీయ సినిమాలో అత్యధిక పారితోషికం అందుకున్న అతికొద్ది మంది హీరోల్లో ఒకరిగా అల్లు అర్జున్ రికార్డు సృష్టించడం ఖాయమని ఆయన అభిమానులు భావిస్తున్నారు. 'పుష్ప-2' చిత్రం స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్ 15 ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# అమెరికా హైవేపై కారు ప్రమాదం.. ముగ్గురు భారతీయ మహిళలు మృతి

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు మృతిచెందారు. ఆనంద్ జిల్లాకు చెందిన రేఖాబెన్ పటేల్, సంగీతబెన్ పటేల్, మనీషాబెన్ పటేల్ ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కరోలినాలోని గ్రీన్‌విల్లే కౌంటీలో ఆ ముగ్గురు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి ప్రమాదానికి లోనైంది. ఎస్‌యూవీ వాహనం అన్ని లేన్లను దాటుకుంటూ.. 20 ఫీట్ల ఎత్తులో గాలిలోకి వెళ్లిందని, ఆ తర్వాత సమీపంలో ఉన్న చెట్లను ఢీకొన్నట్లు గ్రీన్‌విల్లే కౌంటీ పోలీసులు వెల్లడించారు. వాళ్లు ప్రయాణిస్తున్న వాహనం అతి వేగంగా వెళ్తున్నట్లు చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ తెలిపారు. కారును ఓ చెట్టుపై గుర్తించామని, అది ముక్కలు ముక్కలైందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఒకరు మాత్రమే గాయాలతో బయటపడి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహనంలో ఉన్న డిటెక్షన్ సిస్టమ్ వల్ల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు.